# ధాన్యం కొనేదెప్పుడు?



## గంభీరావుపేటలో రైతుల కన్నెర్ర

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డుపై ధాన్యం సంచులు అడ్డంగా పెట్టి ధర్నా చేశారు. వారం క్రితం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, వడ్లను కొనడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. వడ్లను కొనాలంటే అలాట్‌మెంట్ రాలేదని, లారీలు లేవని ఐకేపీ నిర్వాహకులు సాకులు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం అలాట్‌మెంట్ వచ్చినా రైస్ మిల్ యజమానులు అష్టమి ఉన్నదని వడ్లు వద్దన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే రోడ్డుపై టెంట్లు వేసుకుని కూర్చుంటామని హెచ్చరించారు. – గంభీరావుపేట





ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభించి 20 రోజులైనా ధాన్యం కొనడం లేదన్న ఆగ్రహంతో సూర్యాపేట జిల్లా గుర్రంతండా వద్ద దంతాలపల్లి–సూర్యాపేట ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు. నినాదాలు చేస్తూ తమ వడ్లు కొనేదాకా రోడ్డుపై నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు. – చివ్వెంల

## సమ్మెకు సంఘాలన్నీ కలిసిరావాలి

### ఆర్టీసీ కార్మిక సంఘాల తీర్మానం

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాలది ఇక నుంచి ఒకే మాట, ఒకే బాట.. అదే సమ్మెబాట' అని అన్ని సంఘాలు తీర్మానించాయి. మే 7 నుంచి జరిగే ఆర్టీసీ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలని జేఏసీ కోరింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఏసీ మంగళవారం అన్ని కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ.. ఆర్టీసీలో సమ్మె అనివార్యమైతే దానికి వ్యతిరేకంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవహరించబోదని, కార్మిక ప్రయోజనాల కోసం సమ్మెకు అండగా ఉంటామని స్పష్టంచేశారు. అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చేలా జేఏసీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మెలో పాల్గొనేందుకు అన్ని సంఘాలు ముందుకొస్తే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో పాల్గొనేందుకు తామూ వెనుకాడబోమని చెప్పారు. సమ్మెకు వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడలేదని స్పష్టంచేశారు. అనంతరం జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో–చైర్మన్ కే హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో–కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బీ యాదగిరి మాట్లాడుతూ.. యూనియన్ల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను, భేషజాలను విడనాడి జేఏసీతో కలిసి రావాలని, కార్మిక ప్రయోజనాల పరిరక్షణతోపాటు ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలని కోరారు. గతంలో నాయకుల మధ్య అభిప్రాయ భేదాలున్నప్పటికీ సమ్మె సమయంలో అందరూ ఒకే జట్టుగా కలిశారని గుర్తుచేశారు. సమావేశంలో జేఏసీ కోశాధికారి యాదయ్య, మీడియా ఇన్‌చారి అప్పారావు, ప్రతినిధులు ఎన్ కమలాకర్‌గౌడ్, ఎం వెంకటిగౌడ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఎస్‌డబ్ల్యూయూ నాయకులు సాయిరెడ్డి, కేఎస్ పాల్, సీఎన్ కృష్ణ, రాంచందర్, ఏ గౌరీశంకర్, జీ రాములు, ఎస్ వెంకటేశ్, రవీందర్, ముత్యాలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## కడుపు మండి ధాన్యానికి నిప్పు

- సూర్యాపేట జిల్లా గుర్రంతండా వద్ద రైతుల బైఠాయింపు
- సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, ఏప్రిల్ 22: ధాన్యం కొంటలేరని కడుపు మండిన రైతులు రోడ్డుపై వడ్లను తగలబెట్టారు. పంటలు కోసి 45 రోజులైనా.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులవుతున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండా వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని తీసుకొచ్చి రోడ్డుపై పోసి నిప్పు పెట్టి అడ్డంగా కంపవేసి రాస్తారోకో చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ నీళ్లు అందక పంటలు ఎండి కొంత నష్టపోయామని, ఇప్పుడు ధాన్యం కొనకపోతే పూర్తిగా నష్టపోయే పరిస్థితి వస్తదని ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేదాకా కదిలేది లేదని స్పష్టంచేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి రైతుల వద్దకు వెళ్లి మాట్లాడి వారి సమస్యను తెలుసుకొన్నారు. కొనుగోలు విషయంలో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సూర్యాపేట– దంతాలపల్లి రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో.. తహసీల్దార్, ఎస్సైలు వచ్చి సమస్యను అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నిరసనలో గుర్రంతండాతోపాటు, ఐలాపురం, గాయంవారిగూడెం, ఎంజీనగర్‌తండా రైతులు పాల్గొన్నారు.

- వడ్లు కొంటలేరని రోడ్డెక్కిన రైతులు



నెల రోజులవుతున్నా వడ్లు కాంటా వేయడం లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో మంగళవారం సాయంత్రం ధర్నాకు దిగారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే నెల రోజులైనా కొనడం లేదని మండిపడ్డారు. చీకటి పడినా ఆందోళనను కొనసాగించడంతో ఎస్సై నరేశ్ వచ్చి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడించారు. బుధవారం నుంచి కొనుగోళ్లను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. –రామారెడ్డి



రోడ్డుపై పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపెల్లి గ్రామ రైతులు

## మా భూములన్నీ తీసుకోవాలి

- లేదంటే జెన్‌కో కన్వేయర్ బెల్ట్ సర్వే పనులను అడ్డుకుంటాం
- పురుగుల మందు డబ్బాతో సీపెల్లి గ్రామ రైతుల నిరసన

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 22 : జెన్‌కో కన్వేయర్ బెల్ట్ పనుల కోసం తమ భూములన్నీ తీసుకోవాలని భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి అనుబంధ సీపెల్లి గ్రామ రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిచెర్ల నుంచి జెన్‌కో వరకు వేస్తున్న కన్వేయర్ బెల్ట్ తమ గ్రామంలో ఉన్న 250 ఎకరాల భూమి నుంచి వెళ్తున్నదని, సర్వే అధికారులు కేవలం 2 ఎకరాల 20 గుంటల భూమిని మాత్రమే తీసుకొని, ఎకరానికి రూ.16.50 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామంటున్నారని తెలిపారు. కన్వేయర్ బెల్ట్ వేస్తే వాతావరణ కాలుష్యం జరిగి పంటలు పండకుండా నష్టపోతామని, పూర్తిగా భూములు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని జెన్‌కో, రెవెన్యూ అధికారులను కోరారు. లేకపోతే సర్వే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## అలా ఉంటేనే ఇందిరమ్మ బిల్లు!

- 600 చదరపు అడుగుల లోపు నిర్మాణాల ఇండ్లకే బిల్లులు
- 400 చ.అడుగులకు తగ్గొద్దు
- ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు
- ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచబోం
- మంత్రి పొంగులేటి ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇందిరమ్మ ఇండ్ల ను 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులు మించకుండా నిర్మాణం జరిగితే బిల్లులు విడుదల చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లులను వారి ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లు 600 చ.అడుగులలకు మించకుండా ఉంటేనే డబ్బులు విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి, అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని చెప్పారు. అనర్హులను ఎంపిక చేస్తే ఆ గెజిటెడ్ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీతో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువును మరోసారి పెంచే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

## అధికార పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లా!

### జాబితాలో పేరు లేకపోవడంపై మద్దుకూరువాసుల నిరసన

చంద్రుగొండ, ఏప్రిల్ 22 : నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకుండా అధికార పార్టీ నాయకులకే మంజూరు చేశారని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన నిరుపేదలు మంగళవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 42 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే.. అందులో అనర్హులనే ఎక్కువగా ఎంపిక చేశారని ఆరోపించారు. జాబితాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పేర్లే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అర్హులమైన తమకు ఇండ్లు మంజూరు చేయకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

- నిన్న ప్రారంభం.. నేడు మూసివేత



నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని ముష్టిపల్లిలో సోమవారం రాత్రి 6:30 గంటలకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళవారం ఉదయమే కేంద్రానికి రైతులు పెద్ద ఎత్తున ధాన్యం తీసుకురాగా ఐకేపీ అధికారులు కేంద్రాన్ని ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు ఇబ్బందిపడ్డారు. –మక్తల్

## వ్యవసాయశాఖలో పదోన్నతులు!

హైదరాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): వ్యవసాయశాఖలో పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఏడీ, డీడీలకు పదోన్నతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 18మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి కల్పిస్తూ జాబితా సిద్ధం చేసినట్టు తెలిసింది. దీనిపై నేడురేపో ఉత్తర్వులతోపాటు, పోస్టింగ్ ఇచ్చే అవకాశమున్నది. ఇందులో తొమ్మిది జేడీ పోస్టులు రెగ్యులర్ ఉండగా, మరో తొమ్మిది ఆత్మ పీడీ పోస్టులను క్రియేట్ చేసినట్టుగా సమాచారం. ఏడీస్థాయి నుంచి డీడీగా పదోన్నతుల్లో కొంత గందరగోళం నెలకొన్నట్టుగా తెలుస్తున్నది. అర్హులు అధికంగా ఉండడం, పోస్టులు తక్కువగా ఉండడంతో ఏం చేయాలనేదానిపై అధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం 21డీడీ పోస్టులు ఖాళీగా ఉండగా, ఆత్మలో మరో 20డీపీడీ పోస్టులు క్రియేట్ చేసి పదోన్నతులు కల్పించాలని భావిస్తున్నారు. అయితే ఏడీ నుంచి డీడీలుగా ఎంతమందికి పదోన్నతులు కల్పిస్తారనేదానిపై స్పష్టత లేదు. వ్యవసాయశాఖలో పదోన్నతులపై రెండు అసోసియేషన్ల మధ్య కొన్నేండ్లుగా వివాదం నెలకొన్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో రెండు అసోసియేషన్లకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలోభాగంగానే పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించేందుకు పోస్టులు క్రియేట్ చేస్తున్నారు. కాగా, ప్రమోషన్లు పొందిన వాళ్లు మళ్లీ పాతస్థానాల్లోనే కొనసాగేలా, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనే పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టుగా విమర్శలు వస్తున్నాయి.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

## ధర తగ్గించారని మిర్చి రైతుల ఆందోళన

### కేసముద్రం మార్కెట్‌లో నిరసన

కేసముద్రం, ఏప్రిల్ 22 : వ్యాపారులు కావాలనే మిర్చి ధర తగ్గిస్తున్నారని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మార్కెట్‌కు 607 బస్తాల మిర్చి విక్రయానికి రాగా, గరిష్ఠంగా రూ.11,609, కనిష్ఠంగా రూ.8,005 చొప్పున పలికింది. తాలురకం క్వింటాల్‌కు రూ.5,700, కనిష్ఠంగా రూ.4 వేలు పలికింది. గతవారం క్వింటాల్ మిర్చి ధర రూ.13 వేలు ఉండగా ఒక్కసారిగా రూ.1,500 తగ్గించారని ఆరోపిస్తూ రైతులు మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వ్యాపారులు కుమ్మక్కై ఒకరిద్దరు తక్కువ ధరలకు టెండర్లు వేసుకుంటూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. లాట్ నంబర్ చిట్టీపై క్వింటాల్‌కు 2 కిలోల చొప్పున కోత విధిస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. నాణ్యత లేదంటూ ధరలు తగ్గించడం సరికాదని అన్నారు. ఒకరిద్దరు రైతుల మిర్చికి అధిక ధరలు వేసి మిగిలిన వాటికి ధరలను పూర్తిగా తగ్గిస్తున్నారని ఆరోపించారు. రైతులతో ఎస్సై కరుణాకర్, మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు మాట్లాడి శాంతింపజేశారు. ధర తగ్గిన వారికి మళ్లీ టెండర్లు వేస్తారని తెలుపడంతో రైతులు ఆందోళనను విరమించారు.

## ధాన్యం రాశిపైనే కుప్పకూలిన రైతు

నెల్లికుదురు, ఏప్రిల్ 22 : వడదెబ్బ తగిలి రైతు మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తిలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదనతుర్తికి చెందిన బిర్రు వెంకన్న(55) తాను పండిన వరిని కోసి కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు ధాన్యాన్ని పొలంలో ఆరబోశాడు. మంగళవారం పొద్దంతా ఆ ధాన్యం వద్దే ఉండటంతో ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. ధాన్యాన్ని నేర్పుతూ ధాన్యం రాశిపైనే కుప్పకూలి మృతి చెందాడు.

## పసుపు క్వింటాల్ @ 16,001

### మెట్‌పల్లిలో రికార్డు స్థాయిలో ధర

మెట్‌పల్లి, ఏప్రిల్ 22: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పసుపునకు రికార్డు స్థాయిలో ధర పలికింది. పసుపు ఉత్పత్తులకు సంబంధించి వివిధ రకాలకు వేర్వేరు ధరలు పలికాయి. పసుపు కాడి (కొమ్ము) రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.16,001, కనిష్ఠంగా రూ.9,111, గోళ (మండ) రకానికి గరిష్ఠంగా రూ. 13,511, కనిష్ఠంగా 9,006, చూర రకానికి గరిష్ఠంగా రూ.11,144, కనిష్ఠంగా 8,911 ధర పలికింది. కాగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధికం.

# సమ్మర్ సెలవుల రద్దుపై టీచర్ల గుర్రు

వారం శిక్షణకు హడావుడి ఎందుకు? • ఎందుకు భయానికి గురిచేస్తున్నారు • ప్రశ్నిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయ వర్గాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): వేసవి సెలవుల రద్దుపై ప్రభుత్వ ఉపాధ్యాయ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. పాఠశాల విద్యాశాఖ వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నపళంగా సెలవులు రద్దుచేయడంపై మండిపడుతున్నారు. శిక్షణ పేరుతో సెలవులనే రద్దుచేయడం దేనికని ప్రశ్నిస్తున్నారు. వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ తాజాగా నిర్ణయించింది. మే నెలలో ఈ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ శిక్షణ నేపథ్యంలో అనుమతిలేనిదే ఉపాధ్యాయులు సెలవులు తీసుకోవద్దని, హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లవద్దని వివిధ జిల్లాల డీఈవోలు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. వారం రోజుల శిక్షణ కోసం ఎందుకింద హడావుడి అంటూ




ప్రశ్నిస్తున్నారు. గతంలో తాము తాము శిక్షణ పొందలేదా? శిక్షణ పేరుతో వేరే అంశాలను తమపై రుద్దలేదా? అని ఓ ఉపాధ్యాయుడు అభిప్రాయపడుతున్నారు. శిక్షణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఏకంగా ఫోన్లు చేసి నిలదీస్తున్నారు.

### ఉపాధ్యాయ సంఘాలతో నేడు సమావేశం

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఈ సమావేశం జరగనున్నది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ప్రతి సంఘం, అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఈ సమావేశానికి పిలిచింది. ఈ సమావేశంలో సెలవుల రద్దు అంశాన్ని ప్రస్తావించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు భావిస్తున్నారు. బుధవారం పాఠశాలల చివరి పని దినం కావడంతో తప్పనిసరిగా టీచర్లు విధుల్లో ఉండాల్సిందే. ఇటు బడిలో ఉండాలని చెప్పి, మరోవైపు సమావేశానికి పిలవడంపై ఓ ఉపాధ్యాయ సంఘం నేత ఒకరు తన అసంతృప్తిని వ్యక్తంచేశారు.

### ఉపాధ్యాయుల అభ్యంతరాలు

- వేసవిలోనూ సెలవులు ఇవ్వకపోతే ఎలా అంటూ ఓ ఉపాధ్యాయ సంఘం నేతలకు కొందరు టీచర్లు ఫోన్లు చేసి నిలదీశారు. మీరు పోరాటాలు మరువబట్టే టీచర్లకు విలువలేకుండా పోతున్నదని ఫైర్ అయ్యారట.
- టీచర్లకు డీఏలు ఇవ్వరు. పీఆర్సీ ఊసే లేదు. హెల్త్‌కార్డులు రావు. పెండింగ్ బిల్లులే ఇవ్వరు. ఓల్డ్ పెన్షన్ రాదు. టీచర్ల జీవితాలు శిక్షణలు, సర్వేలు, డ్యూటీలకేనా? అంటూ మరో టీచర్ నిర్వేదం వ్యక్తంచేశారు.
- ప్రపంచంలో ఎవరికీలేనన్ని సెలవులు టీచర్లకే ఉన్నాయని సీఎం అన్నప్పుడే.. ఇక మాకు సెలవులు ఉండవన్న అంతరార్థాన్ని తెలుసుకోలేకపోయాం.. అంటూ ఇంకో టీచర్ అభిప్రాయపడ్డారు.
- కావాలంటే మే నెల ప్రారంభంలోనే శిక్షణ శిబిరాలు పెట్టండి. విడుతల వారీగా స్లాట్లుగా విభజించి. అందుకు నెలంతా సెలవులు రద్దుచేయడం ఎందుకు? అంటూ పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ టీచర్ ప్రశ్నించారు.